క్లుప్తంగా

నియామకం


నకీర్త ప్రశాంత్


పిడిశెట్టి గుణసాగర్

కమలాపూర్ : మండలంలోని వంగపల్లికి చెందిన నకీర్త ప్రశాంత్‌ను ప్రపంచ మానవ హక్కుల మండలి స్వచ్ఛంద సంస్థ తెలంగాణ రాష్ట్ర విద్యా విభాగ ఉపాధ్యక్షుడిగా, శంభునిపల్లికి చెందిన పిడిశెట్టి గుణసాగర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రేవూరి బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమను ఆ పదవుల్లో నియమించిన జాతీయ అధ్యక్షుడికి, రాష్ట్ర కమిటీకి ప్రశాంత్, గుణసాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

కమిటీ ఎన్నిక


ఎన్.శ్రీనివాసరావు


ఇజిగిరి రాజేందర్

పరకాల : ఆరె సంక్షేమ సంఘం పరకాల పట్టణ కొత్త కమిటీని స్థానిక అమరధామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగుర్ల శ్రీనివాసరావు, ఇజిగిరి రాజేందర్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా లాసాని నర్సింగరావు, తిప్పారపు రాము, కోశాధికారిగా కాత్మండి సాంబశివరావును, సలహాదారులను ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు ఎద్దె రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగుర్ల నాగేశ్వర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి అడగాని జనార్దన్‌రావు, కోశాధికారి వాడికారి శివాజీ, వీరాబాయి, రాధాబాయి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం



ఎల్కతుర్తి : ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని ఎంపీపీ మేకల స్వప్న తెలిపారు. హుస్నాబాద్‌లోని శుభం గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సోషల్ మీడియా విస్తృత స్థాయి సమావేశానికి మండల కేంద్రం నుంచి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, నాయకులు వినయ్‌గౌడ్, గుండేటి సతీష్, ప్రవీణ్‌కుమార్, గోలి అఖిల్, చిట్టిగౌడ్ పాల్గొన్నారు.

సామాజిక సేవతో రుణం తీర్చుకుంటాం

హన్మకొండ చౌరస్తా: ఉద్యోగరీత్యా ఖండాంతరాలు దాటి వెళ్లినప్పటికి సామాజిక సేవా కార్యక్రమాలతో మాతృభూమి రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తూనే ఉంటామని న్యూజెర్సీ, అమెరికన్ తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు కంచనకుంట్ల శ్రీధర్‌రెడ్డి, పింగిలి భగవాన్‌రెడ్డి అన్నారు. న్యూజెర్సీ, అమెరికన్ తెలంగాణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని లెప్రసీకాలనీ వాసులకు, ములుగురోడ్డులోని స్నేహ మహిళా సొసైటీ, నిట్ ఎదురుగా ఉన్న సహృదయ వృద్ధాశ్రమం, హంటర్‌రోడ్డులోని ఏకశిల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి న్యూజెర్సీ, అమెరికా లాంటి దేశాలకు వెళ్లి స్థిరపడ్డప్పటికీ మాతృదేశంపై మమకారంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, రిటైర్డ్ ఏసీపీ విద్యాసాగర్, డీఎఫ్‌ఓ జోగేందర్, ప్రొఫెసర్ మకరంద్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, వ్యాపారవేత్తలు వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఏక్ దిన్ మే కరోడ్ అకౌంట్స్'

హసన్‌పర్తి: భారత తపాలాశాఖ ఏక్ దిన్ మే కరోడ్ అకౌంట్స్ (ఒకరోజులోనే కోటి ఖాతాలు) కార్యక్రమాన్ని చేపట్టినట్లు హసన్‌పర్తి పోస్ట్‌మాస్టర్ బంగారు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 28నుంచి 30వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డివిజన్ అభివృద్ధే ధ్యేయం

హసన్‌పర్తి: అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. 55వ డివిజన్ బ్యాంక్‌కాలనీ -11లో సుమారు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమస్యలను కాలనీవాసులు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంగాల చిన్న, దేవస్థాన ధర్మకర్త భరత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి అధికారం ఖాయం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య

పరకాల : కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దేవు సాంబయ్య తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా శ్రేణులను ఉద్దేశించి సాంబయ్య మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ వచ్చాక పేదల జీవనం మెరుగు పడిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకూ బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పాలనలో ప్రధాని మోదీ జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజాసంక్షేమం బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆ దిశగా శ్రేణులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, నాయకులు ఆకుల రాంబాబు, దంచనాల సత్యనారాయణ, దార్న నారయణదాసు,



'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షిస్తున్న సాంబయ్య, నాయకులు

ముత్యాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ ఇస్తున్న ఘనత బీజేపీదే

ఆత్మకూరు : రైతులకు సబ్సిడీ ఇస్తున్న ఘనత బీజేపీదేనని ఆ రాష్ట్ర నాయకుడు, మన్‌కీ బాత్ మండల ఇన్‌చార్జ్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంతోపాటు నీరుకుళ్ల, పెంచికలపేట, కొత్తగట్టు, మల్కపేట, గుడెప్పాడ్, నాగయ్యపల్లె గ్రామాల్లో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడారు. ప్రధాని మోదీ సూచన మేరకు మండలంలోని రైతులు చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి, ఎదులాపురం శ్రావణ్‌కుమార్, నాయకులు పైడి ఆచార్య, మాలగాం ప్రశాంత్ పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయని రాస్తారోకో


ఎల్కతుర్తి : ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న గోపాల్‌పూర్ రైతులు


ఐనవోలు : వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు

ఎల్కతుర్తి : సాగుకు సక్రమంగా కరెంటు ఇవ్వడం లేదని, పంటలు ఎండుతున్నాయని మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గోపాల్‌పూర్ రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. తొలుత ఎల్కతుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడారు. ప్రభుత్వం 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు గొప్పలు చెప్పుందే తప్ప వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడంలో విఫలమవుతోందన్నారు. రైతుల ఆందోళన గురించి తెలుసుకున్న స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్ ఘటనా స్థలికి చేరుకొని రైతులకు నచ్చజెప్పేందుకు యత్నించారు. విద్యుత్‌శాఖ అధికారులు డీఈ, ఏఈలు గోపాల్‌పూర్‌కు చేరుకుని ఎండిన పంటపొలాల్ని పరిశీలించారు. సాగుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రావు, సందెల పోలు, రాజేశ్వర్‌రావు, పోల్నెని రాజేశ్వరావు, తిరుపతిరావు, మహేందర్‌రావు, లింగారావు, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఐనవోలు : విద్యుత్ కోతలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు లైన్‌మెన్ నర్సయ్య, హెల్పర్ అశోక్, ఆపరేటర్ రమేష్‌లను కొద్దిసేపు నిర్బంధించారు. ఫోన్‌లో ఏఈతో మాట్లాడారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. రైతుల సమస్యను పరిష్కరించాలని చెప్పారు. విద్యుత్ కోతల వల్ల మక్కజొన్న, వరి పంటలు నీటి ఎద్దడికి గురవుతున్నట్లు తెలిపారు. పంటలు ఎండిపోకముందే అధికారులు స్పందించాలని సూచించారు. వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, గృహ వినియోగదారులపై విధించిన ఏసీడీ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ లైన్‌మెన్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మెట మహేష్, కూస చిరంజీవి, మోటె చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అగ్రంపహాడ్‌లో తల్లులకు ముందస్తు మొక్కులు



ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ తల్లులకు జాతరలో భక్తులు ఆదివారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చే నెల 1 నుంచి 5 వరకు మినీ అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో భక్తులు ఆదివారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓ శేషగిరి తెలిపారు.

ఆర్థికసాయం



నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన బండి ప్రవీణ్ ఇటీవల విద్యుద్ఘాతానికి గురై మృతి చెందగా అతడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆదివారం ఆర్థికసాయం చెక్కు అందించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు ప్రవీణ్ కుటుంబానికి ఇనుగాల ట్రస్ట్ చెక్ అందించినట్లు తెలిపారు. పేద కుటుంబాలకు పార్టీ, ఇనుగాల ట్రస్ట్ అండగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, రాజు, విజేందర్, పాపిరెడ్డి, ప్రశాంత్, సేరేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఎల్కతుర్తి : రథ సప్తమిని పురస్కరించుకొని మండలంలోని దామెర గ్రామంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆత్మ, జీవాత్మ, పరమాత్మ వివరం తెలియజేయడమే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం సమాజంలోని కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య అనుమానాల నివృత్తికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడే అన్న భావాన్ని, దైవభక్తిని పెంపొందించడానికి దోహద పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీదేవి నక్షత్ర, వంశీ, శకుంతల, గోపి, రమేష్, సతీష్‌చారి, ప్రియాంక, బిందు, జ్యోతి, సరిత, తిరుపతి, కుమారస్వామి పాల్గొన్నారు.


భగవద్గీత ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

హన్మకొండ: విద్యుత్ విశ్రాంత ఇంజనీర్ల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విద్యుత్ విశ్రాంత ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఇది ఉద్యోగుల అవిశ్రాంత కృషితో సాధ్యమైందని కొనియాడారు. దైనందిన జీవితంలో డైరీ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. రిటైర్డ్ ఇంజనీర్స్ టెలిఫోన్ డైరెక్టరీని అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సమాజ సేవలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. కార్యక్రమంలో కొండల్‌రావు, సత్యనారాయణ, సుధాకర్, భీమ్ రావు, సుదర్శన్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

వరంగల్ చౌరస్తా: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరంగల్ బట్టలబజారులోని వేంకటేశ్వర దేవాలయంలో భూదేవి, వేంకటేశ్వర స్వామిని రథోత్సవంపై అర్చకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఊరేగించారు. చిన్నజీయర్ స్వామి శిష్య బృందం రాఘవాచార్యుల మంత్రోచ్ఛరణతో ఆలయ అర్చకుల సమక్షంలో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నిత్యారాధన, ద్వారతోరణం, నిత్య హవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు, అమ్మవారికి ఒడిబియ్యం (సారె) నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, మహా అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గందె కల్పన, చింతాకుల అనిల్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గందె గోవిందరాజులు, గుమ్మడవెల్లి సత్యనారాయణ, ఆలయ సేవా సమితి సభ్యులు రవ్వ కృష్ణమూర్తి, గరిమళ్ల లక్ష్మీనర్సయ్య, శ్యాంసుందర్, మల్లన్న దేవస్థాన చైర్మన్ బెల్లం రాజు, రఘేషధాని, చింతకుల సునీల్, కొండూరు జ్ఞానేశ్వర్, దాలియా పరివారం, తోనుపునూరి అశోక్, ఈశ్వర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎలపాటి రత్నాకర్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.


స్వామి వారిని రథోత్సవంపై ఊరేగిస్తున్న భక్తులు, అర్చకులు

అన్ని రంగాల్లో రాణించాలి

కాజీపేట రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి ప్రయోజకులు కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ మౌంట్‌ఫోర్టు స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా చీఫ్‌విప్ మాట్లాడుతూ మౌంట్‌ఫోర్టు ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. మౌంట్‌ఫోర్టు స్కూల్ కరస్పాండెంట్ బ్రదర్ ఆంటోని, నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణరావు, సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్‌ప్రకాష్, కార్పొరేటర్ సర్తాజ్‌బేగం, కాసు మర్రెడ్డి, ఫాదర్ రాయప్ప, డీఎస్‌పీఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గీతకార్మికుల సంక్షేమమే జేఏసీ లక్ష్యం


మాట్లాడుతున్న మండ వెంకన్న

ఖిలా వరంగల్: గీత కార్మికుల సంక్షేమమే గౌడ జేఏసీ లక్ష్యమని రాష్ట్ర జేఏసీ నేతలు బొనగాని యాదగిరిగౌడ్, జనగాం వెంకన్న, పులి శ్రీనివాస్, మండ వెంకన్న, కార్పొరేటర్ పోశాల పద్మ, స్వామిగౌడ్ అన్నారు. గౌడ సంఘాలు ఐక్యమత్యంతో కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. కరీమాబాద్ రోడ్డులోని ఆదర్శ పరపతి సంఘం భవనంలో మండ వెంకన్న గౌడ్ అధ్యక్షతన గౌడ సంఘాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గౌడ కులస్తులు ముందు నిలిచారని గుర్తుచేశారు. అయితే, నేడు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా గీత కార్మికులు వెనుకబడి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో సుమారు 18శాతం ఉన్న గౌడ కులస్తులకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కడం లేదని వాపోయారు. కులస్తుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే గౌడ జేఏసీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో మార్క రవి, అనంతుల రమేష్‌గౌడ్, గట్టు రమేష్, మండ శ్యామ్, గొడిశాల సూరజ్, న్యాయవాది కూనూరు రంజిత్‌గౌడ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మౌల్వి మహమ్మద్ రియాసుద్దీన్ మాట్లాడుతూ సర్వమతాల సారాంశం ఒక్కటేనని అన్నారు. విద్యార్థులు సోదరభావంతో కలిసి ఉండాలని సూచించారు. ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడమే లక్ష్యంగా చదువుకోవాలని అన్నారు. అనంతరం ఖురాన్ పఠన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్లు మహమ్మద్ అంజద్, యాకూబ్ పాషా, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు లైసెన్స్‌మేళా

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన డ్రైవింగ్ లైసెన్స్‌మేళాను 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈమేరకు డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్లు దరఖాస్తులు నింపి కార్పొరేటర్‌కు అప్పగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగ్, ఎలకంటి రాములు, ట్రాఫిక్ ఎస్సై నాగరాజు, ఈసంపల్లి సంజీవ్, మల్లేశం, శ్రీధర్ రెడ్డి, ఎండి.ఖాజా పాల్గొన్నారు.


మేళాను ప్రారంభించిన అభినవ్ భాస్కర్

బీఆర్‌ఎస్‌లో కార్యకర్తలందరికీ గుర్తింపు

● ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్‌ఎస్‌లో పని చేసే కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి వినయ్‌భాస్కర్, ధర్మారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో యువతకు పెద్దపీట వేస్తామన్నారు. యువకులు ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే ధర్మారెడ్డి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్మూరి వెంకట్ కోరారు. మండలంలోని దేశరాజుపల్లి, వంగపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో ఆదివారం చేరగా వారికి వెంకట్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన అందిందన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఆ దిశగా శ్రేణులు గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. అనంతరం గూడూరు, దేశరాజుపల్లి, వంగపల్లి గ్రామ కమిటీలను ఆయన ప్రకటించారు. గూడూరు అధ్యక్షుడిగా పాక రాజు, ఉపాధ్యక్షుడిగా మార్త విష్ణు, దేశరాజుపల్లి అధ్యక్షుడిగా సముద్రాల రమేష్, ఉపాధ్యక్షుడిగా సముద్రాల రమేష్‌బాబు, యూత్ అధ్యక్షుడిగా నాగుర్ల వెంకటేష్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా సురావు విఘ్నేష్, వంగపల్లి అధ్యక్షుడిగా అమ్జద్‌పాషా నియమితులైనట్లు వివరించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండపు చరణ్ పటేల్, టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ తౌటం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దేశిని అయిలయ్యగౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రిక్కల నారాయణరెడ్డి, నాయకులు సముద్రాల కృష్ణ, బాలపురి కనుకరత్నం, కొండపాక మనీష్‌గౌడ్, ఆకినపెల్లి భిక్షపతి, భాషబోయిన రమేష్, పోతిరెడ్డి ఓదెలు, కిన్నెర కృష్ణమూర్తి, కుమ్మరి ప్రశాంత్, పాక అశోక్, నాగరాజు, నరిగె రాజు, బోయిని సాంబయ్య, పాక మల్లయ్య పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో వెంకట్, తదితరులు

మాజీ సైనికుడికి ఉత్తమ జవాన్ అవార్డు

నడికూడ : మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిట్ల వేణుగోపాల్ నేతకు వెటరన్ వరంగల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఉత్తమ జవాన్ అవార్డు అందజేశారు. హనుమకొండలోని ఆదర్శ లా కాలేజ్‌లో జరిగిన అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో వేణుగోపాల్‌ను నారాయణరెడ్డి అవార్డు అందించి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కరుణాకర్, కోశాధికారి రమేష్, మాజీ సైనికులు పాల్గొన్నారు.


బిట్ల వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న వెటరన్ వరంగల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కంటికి రెప్పలా కాపాడుకుంటాం

నయీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాలనీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్‌లో చీఫ్‌విప్ ఆదివారం విస్తృత స్థాయి పర్యటన చేశారు. డివిజన్‌లో రూ.3కోట్ల విలువైన రోడ్లు, డ్రెయినేజీ, కమ్యూనిటీ హాల్, ఆలయ కల్యాణ మండప నిర్మాణ పనులను పరిశీలించి పూర్తయిన వాటిని ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం కేయూ క్రాస్ భారతి విద్యాభవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగా జమున తహజీబ్‌కు మారుపేరు బీఆర్‌ఎస్ పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన 300మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, రైతురుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


వయోవృద్ధులను సన్మానిస్తున్న చీఫ్‌విప్

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


పనులను ప్రారంభించిన బన్న ప్రభాకర్

మామునూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు తామంతా సమష్టిగా కృషి చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహంకాళి జిల్లా ఇన్‌చార్జ్ బన్న ప్రభాకర్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మన్నె బాబురావు ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, కుల వివక్షపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని గుర్తుచేశారు. రవిప్రసాద్, రామ్‌చందర్, హరిప్రసాద్, తిరుపతి, రాములు, నర్సింగరావు, కిష్టయ్య, సాంబయ్య, రాజశేఖర్, రాకేష్, మధు, మహేష్ పాల్గొన్నారు.

3కే ఫిట్‌రన్‌ను విజయవంతం చేయండి

హన్మకొండ చౌరస్తా : రాజ్ ఎరోబిక్స్, డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న నిర్వహించనున్న 3కే ఫిట్‌రన్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రముఖ సినీ నిర్మాత వరంగల్ శ్రీను పిలుపునిచ్చారు. హనుమకొండలోని ఏరోబిక్ సెంటర్‌లో నిర్వాహకులతో కలిసి ఫిట్‌రన్ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 12న ఉదయం 8గంటలకు కాజీపేటలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వద్ద ఫిట్‌రన్ ప్రారంభమై హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ వరకు కొనసాగుతుందని వివరించారు. నగరంలోని యువత, క్రీడా సంఘాల బాధ్యులు, వాకర్లు ఫిట్‌రన్‌లో పాల్గొని విజయవంతం చేయడం ద్వారా స్ఫూర్తిని ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్ ఎరోబిక్స్ అకాడమీ చైర్మన్ రాజ్‌కుమార్, తిరుపతి, వినోద్, సంజీవ్, అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీను, నిర్వాహకులు